

ఉట్నూర్‌లో ఓటరు జాబితాలను సరి చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఏడేళ్ల తర్వాత ఎన్నికలు..!!

● అధికారుల ముమ్మర ఏర్పాట్లు

ఉట్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయదశమి వరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రభుత్వం నుంచి ప్రకటనలు వస్తుండడంతో పంచాయతీ అధికారులు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి గతంలో ఎన్నికలు జరగక పోవడంతో.. ఏడేళ్ల తర్వాత ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి ఎన్నికలు వస్తున్నాయని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చునని బావిస్తున్న అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారీగా ఓటరు జాబితాలను సవరిస్తున్నారు. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతిలో 12,621 ఓటర్లు ఉండగా 18 వార్డులు ఉన్నాయి. నేరుగా సర్పంచ్ ఎన్నికతో పాటు వార్డు సభ్యుల ఎన్నికల కోసం బ్యాలెట్ బాక్స్‌లలో ఓటింగ్ నిర్వహించేలా అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రతీ వార్డులో 200 నుంచి 250 ఓట్లు ఉండే విధంగా వార్డులను సిద్ధం చేస్తున్నారు.

రిమ్స్ ప్రొఫెసర్‌కు సన్మానం

ఉట్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ మెడికల్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ తిప్పేస్వామిని అఖిల భారత బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ బీంరావ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎముకల డాక్టర్‌గా జిల్లా ప్రజలకు సేవలు అందించిన డాక్టర్ తిప్పేస్వామి వైద్య విద్యార్థులకు బోధన అందించడానికి ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టడం శుభపరిణామం అన్నారు. రిమ్స్ డైరెక్టర్ డాక్టర్‌జైసింగ్, నాయకులు ప్రేమ్‌సింగ్ జాదవ్, పవన్ కుమార్, జాదవ్ జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.




● జడ్పీ హాల్‌లో రిజర్వేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

● అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటూ..

షీల్డ్ కవర్‌లో.. రిజర్వేషన్లు!

...ఫైనల్‌కు 'స్థానిక' స్థానాలు



ప్రభుత్వ ఆదేశాలతో.. జిల్లా అధికారులు రెండు రోజుల పాటు కసరత్తు చేసి స్థానిక రిజర్వేషన్లను ఫైనల్ చేశారు. మంగళవారం రాత్రి వరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో అధికారులు ముమ్మర కసరత్తు చేశారు. షీల్డ్‌కవర్‌లో స్థానిక రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలను పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. త్వరలోనే రిజర్వేషన్లపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. ఆ తర్వాతనే నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది.

ఆదిలాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 473 సర్పంచ్ స్థానాలు ఉండగా 3870 వార్డు స్థానాలు, అలాగే 168 ఎంపీటీసీ స్థానాలు, 20 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అయితే మొదట సర్పంచ్ ఎన్నికలు ఉంటాయా? లేదా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహిస్తారా? అనేదానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఏదైనా ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే స్థానిక ఎన్నికలు ఉంటాయని తెలుస్తుంది. సెప్టెంబరు 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు విధించిన గడువు మరో ఆరు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఆ లోగా స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయడం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే మరింత సమయం కోసం రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించే అవకాశం లేక పోలేదన్న అభిప్రాయాలున్నాయి.

జీవో జారీ చేయకుండానే...

ప్రభుత్వం జీవోను జారీ చేయకుండానే స్థానిక ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైకోర్టు ఇచ్చిన గడువు సమయం దగ్గర పడడంతోనే రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. జీవోను జారీ చేయకుండా రిజర్వేషన్లను ఖరారు చేసిన ప్రయోజనం ఉండదంటున్నారు. మునుపెన్నడూ లేని విధంగా జీవో లేకుండానే రిజర్వేషన్లను ఖరారు చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

- జిల్లాలో కొలిక్కి వచ్చిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు
- రిజర్వేషన్ల ఖరారుపై ఇప్పటి వరకు జారీ కాని జీవో
- అధికారిక ప్రకటనపై ఆశావహ నేతల్లో మొదలైన ఉత్కంఠ
- స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లాలో బిన్నాభిప్రాయాలు

అయితే రిజర్వేషన్లపై అధికార వర్గాల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎన్నికలపై కసరత్తు చేసినట్లు హైకోర్టుకు చెప్పుకునేందుకే ప్రభుత్వం హడావిడి చేస్తుందంటున్నారు. ఆపైగా రిజర్వేషన్ వివరాలను వెల్లడించవద్దంటూ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇవ్వడం వెనుక అసలు అంతర్యం ఏమిటన్న? అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి జీవో జారీ చేసిన తర్వాతనే రిజర్వేషన్లను ఫైనల్ చేసే అవకాశం కనిపిస్తుంది.

అంతటా అదే చర్చ

స్థానిక రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేయడంతో జిల్లా అంతటా రిజర్వేషన్ల ఫైననే చర్చ కొనసాగుతుంది. ఏ స్థానంలో? ఏ రిజర్వేషన్? వస్తుందని అధికారులకు ఫోన్లు చేస్తూ నేతలు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రిజర్వేషన్లపై జోరుగా ప్రచారం సాగుతుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన అధికారులు ప్రకటించకుండానే ప్రభుత్వానికి పంపించారు. ముఖ్యంగా

(తరువాయి 6వ పేజీలో....)



బతుకమ్మకు పూజలు చేస్తున్న కలెక్టర్, అధికారులు

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

- జిల్లాకేంద్రంలో సందడిగా సాగిన బతుకమ్మ సంబరాలు
- పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, అధికారులు

7



ఇచ్చోడలోని టీచర్స్ కాలనీలో కొలువుదీరిన దుర్గామాత వద్ద మంగళ హారతులతో స్థానిక మహిళలు

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

- జిల్లావ్యాప్తంగా దుర్గా ప్రతిమలకు ప్రత్యేక పూజలు
- మండపాల వద్ద కొనసాగుతున్న కార్యక్రమాలు

7

ఐటీడీఏ నూతన భవన నిర్మాణం కోసం రూ.15 కోట్లు మంజూరు

● ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు



ఉట్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమగ్ర అభివృద్ధి సంక్షేమ కోసం ఉట్నూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ తెలిపారు. ఐదు దశాబ్దాల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ఉట్నూర్ కేంద్రంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఐటీడీఏ కార్యాలయాన్ని నిర్మించింది. భవనం పాతబడి పోవడంతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్లాబుపై నుంచి కార్యాలయంలోకి నీళ్లు వస్తున్నాయని తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ పాత భవనం స్థానంలోనే కొత్త భవనం నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని గత ఏడు నెలల క్రితం కోరడంతో ప్రభుత్వం ఎట్టకేలకు రూ.15కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇదేకాకుండా ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్మించిన గిరిజన భవన్‌లో మరికొన్ని సౌకర్యాలు కల్పించడానికి అదనపు భవన నిర్మాణం కోసం రూ.50లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు.

అంతర్గత ఆడిట్‌పై సీసీలకు శిక్షణ

తలమడుగు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వసుంధర మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం మహిళా స్వయం శాఖ సంఘాల సీసీలకు, అకౌంటెంట్లకు, వీవోలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అకౌంటెంట్ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సంఘాల లావాదేవీలు ప్రతీ ఒక్కటి పుస్తకాల్లో రాయాలన్నారు. అదేవిధంగా ఆర్థిక ప్రణాళికకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పొందుపరచాలని సూచించారు. ముఖ్యంగా అంతర్గత ఆడిట్ నిర్వహణ ఏటిఆర్ యాక్షన్ టేకెన్ రిపోర్టుల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా అందిస్తున్న పథకాల వివరాలు సబ్సిడీ రుణాల వివరాలు మహిళా సంఘాలకు ఎప్పటికప్పుడు ఆహ్వానం కల్పించి అందించాలని సూచించారు.. గ్రామాల్లో గల ప్రతి మహిళ సభ్యురాలు స్వయం సహాయక సంఘాలలో ఉండే విధంగా చూడాలని కోరారు. ఇందులో ఐకెపి ఎపిఎం చంద్రశేఖర్, సీసీలు, వివోలు ఐకెపి సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్పేర్ పార్ట్స్ బహిరంగ వేలం

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు వాహనాలకు సంబంధించి స్పేర్ పార్ట్స్‌కు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పోలీసు శాఖ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. అన్‌సర్వీస్ అబుల్ స్పేర్‌పార్ట్స్ (విడిభాగాలు) ఒక లాట్, బ్యాటరీలు, టైర్లు, వాడిన ఇంజన్ అయిల్‌లకు అక్టోబర్ 7న ఉదయం 10 గంటలకు స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.మురళి ఫోన్ నెం. 8712659962 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్టీసీలో ఉద్యోగాలు : పీవో

ఉట్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీ కోసం అర్హులైన ఆదివాసీ గిరిజనులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా 18 నుంచి 40ఏళ్ల లోపు వారు ఐదేళ్ల సడలింపుతో డ్రైవర్ ఉద్యోగాలకు, శ్రామిక్ కోసం 18 నుంచి 35ఏళ్ల లోపు వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డ్రైవర్లు వెయ్యి, శ్రామిక్ 743 ఉన్నాయన్నారు. అక్టోబర్ 8 నుంచి దరఖాస్తులు ప్రారంభంకానున్నాయని అక్టోబర్ 28 చివరి తేదీ ఉంటుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపటి తుడుందెబ్బ ర్యాలీకి అనుమతి ఇవ్వరూ!

తలమడుగు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న తలమడుగు మండలంలో 9 ఆదివాసీ సంఘాల. తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతియుత ర్యాలీకి అనుమతి ఇవ్వాలని తుడుం దెబ్బ నాయకులు ఎస్సై రాధికకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, డివిజన్ అధ్యక్షుడు కొమురు జ్ఞానేశ్వర్లు మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన మండలంలో నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఇందులో తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షులు భుజంగరావు, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా కేంద్ర ప్రభుత్వ విధానాలు

● క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ● పట్టణంలో బీసీ కులాల సమీకృత భవన నిర్మాణ పనుల పరిశీలన

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబులను కుదించిన ప్రధాని నరేంద్ర మోదీ సామాన్య ప్రజలకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రధాని నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రజల కొనుగోళు శక్తిని పెంచేందుకు గాను జీఎస్టీపై ఉన్న నాలుగు స్లాబులను కుదించి రెండు స్లాబులు చేశారని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గిస్తే రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతుందంటూ జీఎస్టీపై వివిధ పార్టీలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. నూతన విధానంతో ధరలు తగ్గుతాయని వెల్లడించారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

● బీసీల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే

ఆదిలాబాద్ టౌన్: బీసీల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న బీసీ కులాల సమీకృత భవనాల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన పనులు మళ్లీ ప్రారంభం కావడంతో బీసీ సంఘాల నాయకులతో కలిసి పరిశీలించి గుత్తేదారుడితో ఫోన్‌లో మాట్లాడి త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ... బీసీలోని 34 కులాలకు ఒకే వేదిక ఉండాలనే లక్ష్యంతో బీసీ కులాల సమీకృత భవన నిర్మాణం జరుగుతోందన్నారు. దులో మూడు నాలుగు కులాలకు స్థలం కేటాయిస్తామన్నారు. దాని కోసం అధనంగా రూ.60 లక్షల నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా బీసీ కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్‌మెంట్ కోసం కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు, దశరథ్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు ధోని జ్యోతి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

● వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ

గుడిహత్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత తోషంలో గుడిహత్నూర్ జై దేవి మెడికల్ యజమాని గిత్తే మదన్ ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్



తోశంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం ప్రత్యేకతలు కలెక్టర్ ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు గ్రామస్థులు కలెక్టర్ ఎస్పీని ఘనంగా స్వాగతం పలికారు. వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులచే అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవిత రెడ్డి, ఇచ్చోడ సిఐ బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● వరద భాధితులకు అండగా సేవా కార్యక్రమాలు అభిందనీయం

ఆదిలాబాద్ టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు లయన్స్ క్లబ్ ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని ఎస్‌టీయూ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాలతో నష్టపోయిన బాధితులకు లయన్స్ క్లబ్ ఆదిలాబాద్ కింగ్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వార నిత్యావసరల సరకులతో పాటు పలు సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.



జిల్లా న్యాయాధికారికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

కోర్టును సందర్శించిన జిల్లా న్యాయాధికారి

ఉట్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంగళవారం జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి పి.మౌనికతో పాటు బార్ అసోసియేషన్ న్యాయవాదులు జిల్లా న్యాయాధికారికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి కోర్టులోని వివిధ విభాగాలను పరిశీలించారు. కోర్టులో సమస్యల గురించి జూనియర్ సివిల్ జడ్జి మౌనికను, బార్ అసోసియేషన్ న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.బాపురెడ్డి, ఉపాధ్యక్షుడు బానోత్‌జగన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి బి.జైవంత్ రావు, కోశాధికారి శ్రీనివాస్, న్యాయవాదులు చింతలగిరి, కుడెల్లి అశోక్, నాతరి రాజు, చంద్రమౌళి, విశాల్, జాదవ్‌వినోద్, మౌనాల లక్ష్మినారాయణ, భాస్కర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో ఒత్తిడి బాగా పెరిగిపోయిందని, ఈ సమయంలో అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరముందని డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం రిమ్స్ ప్రాంగణంలోని మహాగణపతి ఆలయంలో పదో ఆయుర్వేద దినోత్సవాన్ని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ తో కలిసి కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌ం... ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు ప్రజలకు పలు పరీక్షలు జరిపి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. అంతకుముందు ధన్వంతరి చిత్రపటం వద్ద అతిథులు పూజలు జరిపి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ.... పురాతన కాలం నుంచి వస్తున్న ఆయుర్వేదుంతో దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయమవుతాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యాధుల తీవ్రత కూడా పెరుగుతోందని, అయుర్వేదం వాటి నివారణకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు ఫరీద బేగం, రాథోడ్ ప్రీతల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంకోలి ఆస్పత్రిలో హెల్త్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ



గిరిజన గర్భిణితో డాక్టర్ల వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న స్టేట్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆోగ్యకేంద్రాన్ని మంగళవారం స్టేట్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ జిల్లా అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిమ్స్ వైద్యులు స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా డేర్మాటలజీ, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్ డాక్టర్స్ వచ్చి క్యాంప్‌లో పాల్గొన్నారని, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ ప్రతి విభాగం వెళ్లి పూర్తివివరాలు అడిగి తెలుసుకున్నారుప. అవుట్ పేషెంట్ గురించి, సికిల్ సెల్ జనరేట్, పీహెచ్‌సీ పరిధిలో లెప్రసి కేసులు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. ట్రిట్‌మెంట్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫాగింగ్ ఎప్పుడు ఎందుకు చేస్తారు, డెంగ్యు కేసుల వివరాలు, కొలాం గిరిజనుల విషయంలో ఎలా మోటివేట్ చేస్తున్నారని, ఐరన్ ఇంజక్షన్ పెట్టుకుంటున్న గిరిజనుల గర్భిణీల నుంచి వచ్చిన సమాధానంతో సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, డిప్యూటీ అధికారిని డాక్టర్ సాధన, మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్, అంకోలి డాక్టర్ సర్వరాజ్, డాక్టర్ ఆశాకిరణ్, ఆరోగ్య పర్యవేక్షకులు బి.సుభాష్, జి.మేరీ, ఎ.శకుంతల, స్టాఫ్ నర్సులు రాజ్యలక్ష్మి, సింధు, ప్రతిమ, ల్యాబ్ టెక్నీషన్స్ సమీ, అరుణ్, సుష్మ, హెల్త్ అసిస్టెంట్‌లు నల్ల ఈశ్వర్ రెడ్డి, ప్రేమ్ సింగ్ పవర్, ఆయుష్ అసిస్టెంట్ తిరుమల, ఫార్మాసిస్ట్ సంధ్యా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గంజాయి రహిత జిల్లాగా మార్చుదాం..

- ఎస్పీ అఖిల్ మహాజన్
- మంగళవారం రాత్రి నార్నూర్ పోలీస్ స్టేషన్ సందర్శన
- సిబ్బందికి పలు అంశాలపై సూచనలు

యాదిలో..



దేవి నవరాత్రుల్లో బతుకమ్మ ఆడుతాం

తరతరాల నుంచి వస్తున్న బతుకమ్మ సంప్రదాయం గ్రామాలలో కూడా కొనసాగుతూ వస్తుంది. చిన్నతనం నుంచి దేవీ నవరాత్రుల పూజలతో పాటు బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఆటలు ఆడుతూ.. పాటలు పాడుతూ మహిళలందరూనసఖ్యంగా ఉంటున్నాం. అంతేకాకుండా తెలంగాణ సంస్కృతికీ.. సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుంది.

- శీతల్‌చౌహాన్, పీజీహెచ్‌ఎం, ఉట్నూర్



చేళ్లలో పూలు సేకరించి బతుకమ్మను పేర్చేవాళ్లం

పంట చేలు, పంట క్షేత్రాలకు వెళ్లి రంగు రంగు పూలను సేకరించి బతుకమ్మను పేర్చేవాళ్లం. రోజు సాయంత్రం గ్రామంలోని వీధి కూడలిలో, ఇంటి ముంగిట బతుకమ్మలను ఉంచి మహిళలంతా కలిసి చప్పట్లతో పల్లె పాటలను పాడుకునే వాళ్లం. ఇప్పటిలాగా సౌండ్ సిస్టంలు, డీజేలు పాటలు ఉండేవి కావు. మహిళలు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో పాటను ఎక్కువగా పాడే వారం. బతుకమ్మ వేడుకలను ఎంతో సంబురంగా జరుపుకునే వాళ్లం. భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పూజించే వారిమి.

- వడ్నం జ్యోతి నాగేశ్వర్, మాజీ ఎంపీపీ, కుభీర్



తొమ్మిది రోజులు సందడి చేసేవాళ్లం

మా దోస్తులమంతా కలిసి తొమ్మిది రోజులు సందడి చేసేవాళ్లం. మా ఊరిలో మేమంతా కలిసి పూలను ఏరుకుని అందంగా బతుకమ్మ పేర్చి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాటలు పాడేవారిమి. అంతేకాకుండా బతుకమ్మ సంబురాల్లో భాగంగా తొమ్మిదవ రోజు ఊరంతా కలిసి చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేసి, ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలను ఒకరికొకరు పంచుకునే వారిమి.

- శాంతపురి శారద, మాజీ జడ్పీటీసీ, దస్తురాబాద్





మాట్లాడుతున్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

దినసరి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

ఉట్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో వేతనాల కోసం నిరవధిక సమ్మె చేస్తున్న దినసరి ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలువెంటనే పరిష్కరించాలని బీజేపీ నిర్మల జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు 12 రోజులుగా అసెంబ్లి చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ దినసరి ఉద్యోగుల సమీక్ష సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. దినసరి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు ఏవైతే ఉన్నాయో? అవన్ని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న వారికి మద్దతుగా మేము ఉంటామని మా పార్టీ వైపున సంపూర్ణ మద్ధతు మీకు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ బీజేపీ మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, లీగల్ సెల్ నాయకులు భాణావత్ జగన్‌నాయక్, మాజీ జడ్పీటీసీ గంగన్న, మండల కన్వీనర్ సాడిగే రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు కందుకూరి రమేష్, సీపతి లింగాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సాల్గర్ రవీందర్, గిరిజన మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ శేషారావు, సీనియర్ నాయకులు ఉస్కెమల్ల దేవిదాస్, టి.నాగభూషణం, శ్రీనివాస్, పందిరి భీమన్న, భాణావత్ జితేందర్, జాదవ్‌రవి, కనక విజయ్, మండల నాయకులు పాల్గొన్నారు.

నూతన ఆలయం వద్ద షెడ్డు ప్రారంభం

నేరడిగొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుద్ధికొండ గ్రామంలో నూతన హనుమాన్ మందిరం వద్ద నూతన షెడ్‌ను మంగళవారం ఆడే గజేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. గత వారం రోజుల క్రితం బుద్ధికొండ గ్రామస్తులు, యువకులు నూతన ఆంజనేయ ఆలయం వద్ద రేకుల షెడ్డు అవసరం ఉందని ఆడే గజేందర్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజులోనే షెడ్ నిర్మించిన ఆడే గజేందర్‌కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు అడిగిన వెంటనే మాకు షెడ్ నిర్మించి ఇచ్చిన ఆడే గజేందర్‌కు గ్రామస్థులు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ మీకు ఎలాంటి అవసరం ఉన్నా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ అవసరం ఉన్న తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి. నాయకులు బద్దం పోతారెడ్డి, మందుల రమేష్, మురళి గౌడ్, నారాయణ రెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు, గ్రామ యువకులు. మహిళలు పాల్గొన్నారు.

జిల్లాలో గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



నార్నూర్‌లో రాత్రివేళ టార్చ్ లైట్‌తో పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ

ఆదిలాబాద్(నార్నూర్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రతీఒక్క పోలీసు అహర్నిశలు కష్టపడాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం రాత్రి నార్నూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో గంజాయి వల్ల కలుగు అనర్థాలు, యువత, దేశ భవిష్యత్తు డ్రగ్స్ మాదక ద్రవ్యాల వల్ల నష్టపోతామన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి రహిత జిల్లాగా నిర్మించడానికి ప్రతీ ఒక్కరి సహకారం ఎంతగానో అవసరం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు గంజాయికి దూరంగా ఉండాలని గంజాయి పండించిన, సేవించిన, వ్యాపారం చేసిన, వర్తకం చేసిన, వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. రానున్నది ఎన్నికల సమయం.. ప్రతిఒక్కరూ పూర్తి సంసిద్ధమై ఉండాలని, గ్రామస్థాయిలో వీపీవో విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, గ్రామాల్లో జరుగు అసాంఘిక కార్యకలాపాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమాచారమైన క్షణాల వ్యవధిలో చేరుకునేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో సత్సంబంధాలను మెరుగుపరుచుకోవాలని గ్రామాలను సందర్శిస్తూ యువతకు చదువు పట్ల, భవిష్యత్తు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వెంటనే సమస్య పరిష్కారం దిశగా సిబ్బందిని కేటాయించి తగు పరిష్కారం చూపించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని సూచించారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో మండపాల వద్ద ఎలాంటి ఇవ్ టీజింగ్ జరగకుండా మహిళలకు అండగా ఉండాలని ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని తెలపాలని, వాహనాల తనిఖీ నిర్వహిస్తూ పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, నార్నూర్ సీఐ పి.ప్రభాకర్, ఎస్సై కె.అఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు

● ఆదిలాబాద్ రూరల్ సీఐ కె.ఫణీధర్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం సమయంలో, జందాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సుల్తానా బేగం నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఎస్సీ కాలనీలోని బతుకమ్మ గద్దె పైనుంచి వాహనాన్ని తీసుకువెళ్లడంతో పాటు మహిళలతో నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ, మహిళల పట్ల బతుకమ్మ పట్ల దుర్భాషలాడిన సంఘటనపై జందాపూర్ మహిళలు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి సుల్తానా బేగంపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టడం జరుగుతుందని ఆదిలాబాద్ రూరల్ సీఐ కె.ఫణీధర్ తెలిపారు. ఈ ఘటనపై, శాఖ పరంగా సెక్రెటరీపై అధికారులకు నివేదికను పంపనున్నట్లు తెలిపారు. పండుగలను అవమానించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై వి.విష్ణువర్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బీంపూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీంపూర్ మండలంలోని నిపానిలో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు బీంపూర్ ఎస్‌ఐ విక్రమ్ తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి నల్ల నందు, ఏరా ప్రశాంత్‌లను పట్టుకున్నారు. వారి వద్దనుంచి 2,150 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కాగా దాడి సమయంలో శ్రీకాంత్, నాగన్నలు పరారయ్యని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురు నాయకుల చేరిక

నేరడిగొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు చెట్పల్లి వెంకటేష్ మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరితో పాటు కిసాన్ మోర్చా మండల కార్యదర్శి ఉయిక గంగాధర్, మండల ఉపాధ్యక్షుడు గస్కంటి సంజీవ్, బిజెపి నాయకులు చెట్పల్లి సంతోష్, రవి గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కిసాన్ మోర్చా అధ్యక్షుడు చెట్పల్లి వెంకటేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, నాయకులు సాబ్లే సంతోష్ రాథోడ్ రాజశేఖర్, రాథోడ్ సురేందర్, గులాబ్, లక్మణ్, గణేష్ నాయక్, మాజీ సర్పంచ్ మురళి, గోపి, వెంకటరమణ, చవాన్ రాంకుమార్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలి

ఆదిలాబాద్(నార్నూర్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 30 పడకల దవాఖానలో అనేక సమస్యలు నెలకొన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వాటికి పరిష్కారం చూపాలని కోరుతూ మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుబు బిక్కు రాథోడ్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో మెరుగైన చికిత్స కోసం ఉట్నూర్, ఆదిలాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మంజూరైనా అన్ని వైద్యుల స్థానాలను నియమించాలన్నారు. పోస్ట్‌మార్టం మార్చురీని ఏర్పాటు చేయాలన్నారు.

షీల్డ్ కవర్‌లో.. రిజర్వేషన్లు!

(5వ పేజీ తరువాయి...)

ఆశావహ నేతల్లో రిజర్వేషన్లపై తీవ్రమైన ఉత్కంఠ కనిపిస్తుంది. అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈసారి బీసీ స్థానాల సంఖ్య భారీగా పెరగడంతో అందరి అంచనాలు తారుమారయ్యే అవకాశం కనిపిస్తుంది. అధికారుల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్న నేతలు సోషల్ మీడియా ద్వారా హల్‌చల్ చేస్తున్నారు.అయితే ఖరారైన రిజర్వేషన్లపై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పట్లో స్థానిక ఎన్నికలు ఉంటాయా? లేదా? అనే అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి.

కండువాలు మార్చేస్తున్న నేతలు

స్థానిక ఎన్నికల హడావిడి మొదలు కావడంతో ఆశావహ నేతలు కండువాలనే మార్చేస్తున్నారు. గెలుపు అవకాశాలు ఉన్న పార్టీలో చేరిపోతున్నారు. సామాజిక వర్గం బలంతో పాటు పార్టీ మద్దతు కలిసి వస్తే గెలుపు అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయోనని ఆరా తీస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో పోటాపోటీగా చేరికలు జరుగుతున్నా యి. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఆశావహ నేతలు పార్టీలు మారడంపై జిల్లాలో జోరుగా చర్చ సాగుతుంది. రిజర్వేషన్లపై అధికారిక ప్రకటన వస్తే రాజకీయ వలసలు మరింత పెరిగే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తుంది. అంతేకాకుండా అవకాశం కోసం ఎదురు చూస్తున్న నేతలు మారుతున్న రాజకీయ పరిణామాలను పసిగడుతూ అప్రమత్తమవుతున్నారు.

గంజాయి సాగు చేస్తే చట్ట పరమైన చర్యలు

● నార్నూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పి.ప్రభాకర్

ఆదిలాబాద్(నార్నూర్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాం నార్నూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పి.ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సర్కిల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్నూర్ మండల కేంద్రం పంచాయతీ పరిధి విజయనగర కాలనీ చెందిన కినక జుగదిరావు కౌలుకు తీసుకున్న వ్యవసాయ చేను గంజాయి సాగు చేస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 44 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి మొక్కల విలువ రూ.4,40,000 ఉంటుందన్నారు. అతని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సైలు కె.అఖిల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై ప్రమాదకర గుంతల పూడ్చివేత

బోథ్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లి రోడ్డు గుంతల మాయం కావడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ఈ రోడ్డుపై ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ వెంకటేశ్వరరావు గుంతలను మంగళవారం ఉదయం పూడ్చివేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుల సమాధానంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయడం జరిగింది. పోలీసులు తీసుకున్న నిర్ణయం పట్ల ఈ రూట్లో ప్రయాణించే పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ఖానాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన కొండవేణి శ్రావణ్(17) అనే ఇంటర్ విద్యార్థి మంగళవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ఎస్సై కథనం ప్రకారం... బీర్నంది గ్రామానికి చెందిన కొండవేణి రాజేందర్ కుమారుడైన శ్రావణ్(17) నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశిష్ట జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గతంలో శ్రావణ్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువు కోసం పంపగా అక్కడ డోలో 650 టాబ్లెట్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతని తల్లిదండ్రులు శ్రావణ్‌ను నిర్మల్‌లో ఇంటర్ విద్యను చదివిస్తున్నారు. మంగళవారం గ్రామ శివారులో గల పొలంలో యూరియా మందును చలి రావాలని అతని తండ్రి చెప్పగా అతనితో గొడవ పడ్డాడని తెలిపారు. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగానే శ్రావణ్ తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

న్యూసెన్స్ చేసిన ముగ్గురికి జరిమానా

సారంగాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి (బి) గ్రామ సమీపంలో గల అర్బన్ పార్కు వద్ద రెండురోజుల క్రితం ఆడిపిల్లలపై అల్లరి చేసిన ముగ్గురికి జరిమానా విధించారు. నిందితులు నరేష్, తరుణ్‌కుమార్, సాయికుమార్‌లను మంగళవారం సివిల్‌జడ్జి ఎదుట పోలీసులు హాజరుపరచగా జరిమానా విధించారన్నారు. మూడురోజుల పాటు పార్క్ వద్ద ఉన్నటువంటి పిచ్చి మొక్కలని తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లుగా పోలీసులు తెలిపారు.

నాలుగు ట్రాక్టర్లు సీజ్

నర్సాపూర్(జి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దేవుని చెరువు వద్ద అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలపై సమాచారం అందుకున్న మండల తహసీల్దార్ శ్రీకాంత్ వెంటనే చర్యలు చేపట్టారు. జేసీబీతో మొరం తవ్వుతూ, నాలుగు ట్రాక్టర్లతో తరలిస్తున్నారని తెలుసుకుని సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడుల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా మొరం తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ప్రతి ట్రాక్టర్‌కు రూ. 2,000ల చొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ... రెండోసారి ఇదే తప్పు చేస్తే ట్రాక్టర్లను సీజ్‌చేయడంతో పాటు గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ చట్టం 1957) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే అప్పటికే జేసీబీ తప్పించుకున్నట్లు గిర్దావర్ నవతజ్యోతి తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని ఎగవేస్తూ అక్రమ తవ్వకాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ రాష్ట్ర నాయకులకు సన్మానం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్‌లను నిర్మల్ జిల్లా గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాదవ్ అఖిలేష్ ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నర్సాపూర్(జి) మండలం, నందన్ తండా గ్రామానికి చెందిన జాదవ్ అఖిలేష్ వారిని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా జాదవ్ అఖిలేష్ మాట్లాడుతూ... సాధారణ డివిజన్ స్థాయి నుంచి రవి నాయక్, కళ్యాణ్ నాయక్‌లు ఈ స్థాయికి ఎదగడానికి కారణం నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పార్టీ కోసం అహర్నిశలు శ్రమించడమేనని, ఒక సాధారణ వ్యక్తి కూడా అత్యున్నత స్థాయికి ఎదిగే అవకాశం కేవలం భారతీయ జనతా పార్టీలోనే లభిస్తుందని కొనియాడారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీని బలోపేతం చేసి, గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి రూ.57 కోట్ల నిధులు మంజూరు

● బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కృషితో పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి కుంటుపడిన పట్టణ అభివృద్ధికి రూ.57 కోట్ల నిధులు మంజూరు అయినట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించి మీడియా సమావేశంలో అన్నారు. పట్టణంలోని అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి 15 కోట్లు, కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ పథకం ద్వారా పట్టణంలో ఎస్‌టీపీ ప్లాంట్‌లకు 42 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఘనత మహేశ్వర్ రెడ్డికి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, ఆకుల కార్తీక్, సీనియర్ నాయకులు ఆడెపు సుధాకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, తాజా మాజీ కౌన్సిలర్లు చిన్నయ్య, సాదం అరవింద్, శంకరపతి, పద్మాకర్, నాయకులు జింక సూరి, జుట్టు దినేష్, కొండాజి శ్రావణ్, గిల్లి విజయ్, గంజి రాజు, రాజేష్ రంజిత్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

● ట్రాయ్ కాగ్ సభ్యుడు ప్రభాకర్ రావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రాయ్‌కాగ్ సభ్యుడు ప్రభాకర్ రావు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టెలికాం వినియోగదారులు, సామాన్య ప్రజలు, విద్యార్థులు ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా కాగ్ సభ్యుడు రావూరి ప్రభాకర్ రావు అన్నారు. టెలికాం, సైబర్ నేరాలపై జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెలికాం వినియోగదారుల హక్కుల కోసం భారత ప్రభుత్వం 1997లో ట్రాయ్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ గోవింద్, ఏఎఫ్‌వో రమణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్, ఎయిర్‌టెల్, జియో, వోడాఫోన్ కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మల దేవరావుకు కీర్తి పురస్కారం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ఇచ్చే ప్రతిష్టాత్మక సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ కీర్తిపురస్కారాల సభ హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియం ఎన్టీఆర్ కళా మందిరంలో పురస్కారాల ప్రధానం చేశారు. చరిత్ర పరిశోధనలో కృషి చేసినందుకు తుమ్మల దేవరావుకు తిక్కవరపు రాంరెడ్డి స్మారకకీర్తి పురస్కారం ప్రముఖులతో అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన పద్మ భూషణ్, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు వరప్రసాద్ రెడ్డి, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానందరావు, విశిష్ట అతిథి గణపతి రెడ్డి తెలంగాణ విద్య, మౌలిక సదుపాయాల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... చరిత్ర పరిశోధనలో తుమ్మల దేవరావు కృషిని అభినందించారు. తెలుగు యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ... తుమ్మల దేవరావు మూడు దశాబ్దాలు సాహిత్యమే, చరిత్ర రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు.

బీరప్ప విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

తానూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీ బీరప్ప దేవుని విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనపై తానూర్ మండల కురుమ కులస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై తానూర్ మండల కురుమ కులస్తులు పోలీస్టేషన్‌లో ఎస్సై హన్మండ్లు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు వినతిపత్రాలను అందజేశారు. దుండగులను తక్షణమే గుర్తించి అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ లస్మన్న, నాయకులు పీరాజీ, బి. మాదవరాదు, ఈరేష్, జి.మాదవరావు, పోతన్న, మారోతి, రాహుజీ, దత్త, భుజంగ్‌రావు, కామాజీ, డాక్టర్ నామ్‌దేవ్, వివిధ గ్రామాలకు చెందిన కుర్మ సంఘం సభ్యులు, కుల, సోదరులు పాల్గొన్నారు.

వాహనాల ముమ్మర తనిఖీలు

ముథోల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని తానూర్‌బైపాస్ రోడ్డుపై మంగళవారం ముథోల్ ఎస్సై బిట్ల పెర్సెస్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని ఆపి ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను పరిశీలించిన తర్వాతే వదిలిపెట్టారు. ప్రతి వాహనదారుడు సంబంధిత వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే మితిమీరిన వేగవంతో వాహనాలు నడపరాదని అలాగే ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. కెపాసిటీకి మించి వాహన చోదకులు ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలు చేశారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఏకగ్రీవంగా లోకేశ్వరం గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

లోకేశ్వరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం గ్రామాభివృద్ధి కమిటీ ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా నీలగిరి గంగాధర్, క్యాషియర్ ఉమ్రి నాగేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు

శ్రమదానంతో గుంతలు పూడ్చిన యువకులు

కుంటాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూర్, కుంటాల రహదారిపై అందకూర్ గ్రామ యువకులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. ఇటీవల ప్రతి రోజు వర్షాలకు రహదారిపై తారు లేని గుంతలు ఏర్పడగా గ్రామానికి చెందిన 20 మంది యువకులు స్వచ్ఛందంగా గుంతలను పడ్చారు.

పూజలందుకుంటున్న దుర్గామాత





భక్తులతో కిక్కిరిసిన నందిగుండం దుర్గామాత దేవి ఆలయం

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. భక్తిశ్రద్ధలతో భక్తులు దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ పూజారి రాజు స్వామి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరి నందిగుండం దుర్గామాత దేవి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీగిరి నందిగుండం దుర్గామాత దేవి మంగళవారం రెండోరోజు గాయత్రి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని ఓడి బియ్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు కొండాజి వెంకటాచారి, ఆలయ అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ... ప్రతిరోజు నిత్యాన్నదానం ఉంటుందని అలాగే పాదయాత్రగా వచ్చే స్వాముల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు బహుజన వసతి కార్యక్రమాలు నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా అన్నదానం కోసం విరాళాలు ఇవ్వాలనుకుంటే ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పూజారి నరహరి, సాదం ఆనంద్, యాటకారి సాయన్న, ఆలయ పూజారి సందీప్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.





పూజలు అందుకుంటున్న అమ్మవారు

ముథోల్ : మండలంలోని కారేగాం గ్రామంలో గల శ్రీ రేణుక మాత ఎల్లమ్మ ఆలయంలో అంగరంగ వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఆలయంలో ఘట స్థాపన చేసి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళలో సాయి వైభవ్ వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఈ ఆలయంలో ప్రతిరోజు గ్రామస్థులు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. రాత్రి వేళల్లో భజన సంకీర్తనలు నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద అక్టోబరు 2వ తేదీన దసరా పండుగ పురస్కరించుకొని పెద్ద జాతర కొనసాగుతుంది. ఇక్కడి ప్రజలకు ఇంటి ఇలవేల్పుగా ఎల్లమ్మ దేవి కొలువబడుతుంది. సుదూర ప్రాంతాల నుండి వచ్చి దసరా రోజు భక్తులు ఎల్లమ్మ దేవిని దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. రెండవ రోజైన మంగళవారం గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది.

దుర్గామాత మండప నిర్మాణానికి విరాళం

డొంకేశ్వర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిజి నడ్కూడలో దుర్గామాత మండప నిర్మాణ కోసం గ్రామానికి చెందిన మైస గంగుబాయి మైసా రాజలింగం దంపతులు విరాళం అందించారు. మంగళవారం గ్రామంలో రెండు లక్షల 26 వేల విరాళానికి సంబంధించిన చెక్కును దుర్గామాత కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంజీవ్‌రాజ్ పాల్గొన్నారు.

మహిళ..



బతుకమ్మ అంటే ప్రకృతి ఆరాధన

బతుకమ్మ అంటే ప్రతి మహిళకు సంబురమే. బతుకమ్మను ఆడేందుకు ఎంతో ఇష్టపడతారు. చిన్నప్పుడు మా ఊరైన ఇంద్రవెల్లి మండలం దేవాపూర్‌లో నా స్నేహితులతో కలిసి తీరొక్క పూలను సేకరించి బతుకమ్మను సంబరంగా ఆడేదాన్ని. ఇప్పటికీ మా ఇంటికి వెళ్తే ఈ దసరా నవరాత్రుల్లో బతుకమ్మను ఆడతా. తెంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుంది. బతుకమ్మ అంటే ప్రకృతిని ఆరాధించడం. **- వై. సరస్వతీ, ఆర్ఐ, ముథోల్**



అక్కాచెల్లెళ్ల అనుబంధానికి వేదిక

బిజీ షెడ్యూల్ ఉన్నా...9రోజులపాటు బతుకమ్మ ఆడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. కుటుంబీకులను ఒక్క చోట చేర్చే గొప్ప సంప్రదాయమే ఈ పండగ. పూలు సేకరించి, బతుకమ్మ పేర్చి, పాటలు పాడుతూ వేడుకలు జరుపుకోవడంతో ఆప్యాయతలు పెరుగుతాయి. మా అక్క బీంపూర్ తహసీల్దార్ నలందప్రియ. వృత్తిరీత్యా వేర్వేరు చోట్ల పనిచేస్తున్నా పండుగ వేళల్లో ఇలా కలిసి జరుపుకోవడం హాయినిస్తుంది. **-నవతజ్యోతి, ఆర్ఐ, నర్సాపూర్(జి)**



బతుకమ్మ సంస్కృతికి ప్రతీక

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతికగా నిలుస్తుంది. ఆడపడుచులు గొప్పగా జరుపుకునే పూల పండుగ ఇది. 9 రోజుల పాటు వివిధ రకాల పూలను పేర్చి బతుకమ్మను తయారుచేస్తాం. గౌరీదేవతను పూజించడం ఎంతో అదృష్టంగా భావిస్తాం. మహిళలు ఆడుతూ, పాడుతూ వేడుకలను సంబురంగా నిర్వహించుకుంటారు. ఏటా పండుగ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తాం. **- మంజుల, ఐకేపీ ఏపీఎం ఇంద్రవెల్లి**



ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం



ధన్వంతరికి నివాళులర్పిస్తున్న టీచర్లు

ముథోల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ... 4 వేదాలలో ఒకటైన ఆయుర్వేదం కోత, కుట్టు లేకుండానే మానవ శరీరంలోని రుగ్మతలను తొలగించి, దీర్ఘాయుష్షును ప్రసాదిస్తుందన్నారు. మన చుట్టూ ఉండే తులసి, జామ, ఉసిరి, వేప, కరివేపాకు, మెంతి, పుదీనా, అల్లనేరేడు, వాము, కలబంద, వెల్లుల్లి, ఉల్లి, అల్లముతో పాటు మన వంటింట్లో ఉండే పోపు డబ్బా ఆయుర్వేదంగా మనకెంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడేళ్లుగా ఎదురుచూపులే..!

- కూలీలుగా మారిన రైతులు
- పరిహారం కోసం పడిగాపులు
- పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూ నిర్వాసితుల దుస్థితి

బీంపూర్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణం కోసం ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రైతుల 1,200 నుంచి భూసేకరణ చేసింది. అప్పుడు ఎకరాకు రూ.8లక్షల చొప్పున 180 ఎకరాలకు సంబంధించి పరిహారం చెల్లించారు. మిగతా 1020 ఎకరాలకు సంబంధించిన రైతులు పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారు. ఈ రైతులు ఇచ్చిన భూముల్లో రిజర్వాయర్ పనులు కొనసాగాయి. దీంతో బాధిత రైతులు భూములు సాగుచేసుకోలేక పరిహారం అందక వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఎలాగైనా పరిహారం వస్తుందనుకొని కొందరు వేరే ప్రాంతంలో భూములు కొన్నారు. పరిహారం రాక భూమి అమ్మిన రైతులకు డబ్బులు చెల్లించలేక అయోమయంలో ఉన్నారు.



పిప్పల్‌కోటి రిజర్వాయర్ కెనాల్ గేట్లు

రైతులు కూలీలయ్యారు

ఈ రిజర్వాయర్‌లో తమకున్న 2, 3 ఎకరాలు కూడా కోల్పోయిన రైతులు కొందరు వేరే రైతుల భూములను కౌలుకు తీసుకుంటూ కౌలు రైతులు అయిపోయారు. ఇంకొంత మంది వ్యవసాయ కూలీలుగా అయ్యారు. తమ బతుకులు ఆగం అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూ నిర్వాసితులకు న్యాయం చేస్తే బాగుంటుంది.

● **భూమి పోయింది.. బాధ మిగిలింది**



పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు భూమి ఇవ్వకముందు అదే భూమిలో తాతల కాలం నుంచి సంతోషంగానే ఉండేవారం. సర్కారు వారు ఒత్తిడి చేయటం, మా ప్రాంత రైతుల భూములకు సాగునీరు వస్తుందనే తృప్తితో మేము కూడా రిజర్వాయర్ కోసం భూమి ఇచ్చాం. ఈ పరిహారం వస్తే ఎక్కడైనా రెండెకరాలు కొందామనుకున్నాం. పరిహారం డబ్బులు రాక వ్యవసాయ కూలీలుగా మారాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి. **- షేక్ నసీరుద్దీన్, బాధిత రైతు, పిప్పల్‌కోటి**

ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తా



పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు సంబంధించి పరిహారం రాక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ విషయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు విన్నవిస్తా. అసెంబ్లీ సమావేశంలో ఈ విషయం లేవనెత్తి రైతులకు న్యాయం చేయాలని కోరతా. బాధిత రైతులతో ఎమ్మెల్యేను త్వరలో కలిసి సమస్య వివరిస్తాం. అనిల్‌జాదవ్ సమర్థుడు అయినందున మా గ్రామ రైతులకు న్యాయం జరుగుతుందనే భావిస్తున్నాం. **- కేమ శ్రీకాంత్, న్యాయవాది, పిప్పల్‌కోటి**



ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్న మహిళలు, యువతులు



బతుకమ్మతో అదనపు కలెక్టర్

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనాదిగా వస్తున్న సంస్కృతి, సంప్రదయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ సంబరాలను అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక సాంఘిక సంక్షేమ కార్యాలయ ఆవరణలో వేడుకలు జరిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో భాగంగా తొలుత కలెక్టర్ బతుకమ్మ వద్ద గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ గీతాలకు అనుగుణంగా నృత్యా లు చేస్తూ ఉత్సాహపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ సంబరం సంస్కృతిని ప్రతిబింబిస్తుందని, ప్రకృతిని పూజించే పండగ జరుపుకోవడం గొప్ప విషయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మ గీతాలకు అనుగుణంగా కోలాటాలు ఆడుతున్న కలెక్టర్

తెలుగుభాషకు పూర్వవైభవం తీసుకురావాలి



కవి జేపీరావ్‌ను సన్మానిస్తున్న ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ జాదవ్

భైంసా, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు, భాషాభిమానులు తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు అంకితభావంతో కృషి చేయాలని ముథోల్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ జాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలో అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక ద్వారా సాహితీ కిరీటి పురస్కారానికి ఎంపికైన స్థానిక శ్రీ హంస వాహిని సాహిత్య కళా పీఠం అధ్యక్షులు జాదవ్ పుండలీక్‌రావ్ పాటిల్‌కు నిర్వహించిన అభినందన, సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పరభాష వ్యామోహంతో తెలుగు భాషపై రోజురోజుకు ఆదరణ తగ్గుతూ వైభవం కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు సాహిత్యం, కవిత్వం, సంప్రదాయ కళలను ప్రోత్సహించడంలో సాహితీవేత్తలు ముందుండాలని ఆకాక్షించారు. అధునిక సాంకేతిక వనరులను వినియోగించుకొని తెలుగుభాషకు మరింత విస్తరణ, వైభవం తీసుకరావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సన్మాన గ్రహీత , శ్రీ హంస వాహిని సాహిత్య కళా పీఠం అధ్యక్షులు జాదవ్ పుండలీక్‌రావ్ మాట్లాడుతూ.. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుతూ సాహిత్య సంపదను రాబోయే తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలుగు భాషలో సృజనాత్మక రచనలు విస్తృత స్థాయిలో వెలువరించేలా భాషాభిమానులు కవులు, రచయితలకు తోడ్పాటునివ్వాలన్నారు.భాషా వారసత్వాన్ని కాపాడటం ద్వారా సమాజం సాంస్కృతికంగా బలపడుతుందన్నారు. ఇందులో ఆర్‌ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ , గంగపుత్ర సంఘం అధ్యక్షులు డా.ఆశమోల్ల మోహన్, డా.అశోక్‌తో పాటు పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుంతలో పడితే అంతే సంగతులు

ఉట్నూర్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచిర్యాల రహదారిపై దంతనపల్లి సమీపంలోని వంతెన వద్ద ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదాలకు నెలవుగా మారాయి. పలువురు ద్విచక్రవాహనదారులు పడిపోయిన ఘటనలు అనేకం. ఇరువురు ఈ గుంతలు కనబడకపోవడంతో వేగంగా వచ్చి వారు ప్రాణాలు కోల్పోయారు. గతేడాది పోలీసులు శ్రమదానం చేసి గుంతలు పూడ్చివేశారు. ఇటీవల వర్షాలకు మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు పూడ్చాలని కోరుతున్నారు.



దంతాన్‌పల్లి సమీపంలో భారీ గుంతలు

పైపైనే పైప్‌లైన్

బోథ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రం సమీపంలోని వాగు వద్ద భగీరథ పైప్‌లైన్ పైకి తేలింది. వరద తాకిడితో పైప్‌లైన్ పైకి రావడంతో దానిపై నుండి ఎడ్లబండ్లు, వాహనాలు వెళితే పగిలిపోయే ఆస్కారం ఉంది. అధికా రులు ముందు చూపుతో మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే నీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తే ఆస్కారముంది.



సోనాల సమీపంలోని వాగు వద్ద పైకి తేలిన మిషన్ భగీరథ పైప్ లైన్



ఉట్నూరులో కొలువుదీరిన దుర్గామాత



నేరడిగొండలో దుర్గాదేవి దీక్షలు తీసుకున్న యువకులు



పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

చల్లంగా చూడమ్మా.. దుర్గమ్మా



రాజురలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల నిర్వాహకులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాలనీవాసులంతా తమ ఇంటి నుంచి మంగళహారతులు తీసుకువచ్చి అమ్మా.. మమ్ము చల్లంగా చూడమ్మా అంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అనంతరం కొలాటాలు, నృత్యాలు చేస్తు ఆనందంగా నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వగ్రామమైన రాజురలోని శ్రీజగదాంబ దేవి ఆలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**



ఇచ్చోడలో బతుకమ్మలతో చిన్నారులు



ముత్యంపేట కాలనీలో దుర్గాదేవి పూజ సందర్భంగా మహిళలు, భక్తులు



ముత్యంపేట కాలనీలో మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు

26న ఆర్‌ఎస్ఎస్ దశాబ్ది ఉత్సవాలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్‌ఎస్ఎస్ విద్యానగర్ బస్తీలో ఈనెల 26వ తేదీన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్ఎస్ విభాగ్ సంచలాక్ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్టించిన దుర్గామాత మండపంలో మంగళవారం పూజలు జరిపారు. అనంతరం దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 26 నాటికి ఆర్‌ఎస్ఎస్ స్థాపించి వందేళ్ల పూర్తయిందని, ఇందులో భాగంగానే దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ రానున్నారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సుభాష్ రెడ్డి, కోరెడ్డి లేనిన్, సంతోష్, బిజాబాయి, విజయ్, సునీల్, కిషోర్ సింగ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి కమిటీ ఎన్నిక

ఉట్నూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ మంగళవారం ప్రకటించారు. మంగళవారం ఉట్నూర్‌లో జరిగిన షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి సమావేశానికి హాజరైన సందర్భంగా జిల్లా కమిటీ కన్వీనర్‌గా కాటం రమేష్, కో కన్వీనర్‌గా కాంబ్లె ప్రజ్ఞశీల్, జాడి వెంకటేష్‌నేత, కాంబ్లె భగవాన్, కాంబ్లె నరహరి, సంతోష్, బిందాస్ కాంబ్లె, రాందాస్ జాదవ్, సంతపూరి రాజేశ్వర్‌లను నియమించారు.



నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్

డిమాండ్ల సాధనకు 26న చలో ప్రజాభవన్



సమావేశంలో పాల్గొన్న నేతలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో ఐఎఫ్‌హెచ్ఎంఎస్ విభాగంలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులతో ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆరోపించారు. కనీస వేతనాలు చెల్లించకుండా ఇచ్చే అరకొర వేతనాలను క్రమంగా చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మంగళవారం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతోపాటు... ఉద్యోగ భద్రత, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాన్ని, పీఎఫ్, ఈఎస్ఐని ఖాతాల్లో వెంటనే జమచేయాలన్నారు. డిమాండ్ల సాధనకోసం ఈ నెల 26వ తేదీన చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్మికులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పండుగ పోచ్చన్న, రిమ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ దశాంత్, సూపర్ స్పెషాలిటీ అధ్యక్షులు కృష్ణ, కార్యదర్శి దేవేందర్, కోశాధికారి రాకేష్, ఉపాధ్యక్షులు అమీర్ అలీ, రాందాస్ గంగమ్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చర్మ వ్యాధి నిపుణుడు (రిమ్స్) వైద్యాధికారి హరిప్రసాద్ సూచించారు. మంగళవారం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న మహిళల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరో గ్య సమస్యలు ఉన్న మహిళలు వైద్య పరీక్షలు చేయించుకొని మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మహిళల్లో అత్యధికంగా రక్తహీనతతో బాధడుతున్నారని డాక్టర్ సద్దాం ఆయనకు వివరించారు. శిబిరంలో వచ్చిన వారందరికీ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు సంతోష్, స్వర్ణలత, హెల్త్‌అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

భీంపూర్ నూతన ఎస్ఐ విక్రమ్‌కి సన్మానం

బీంపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విక్రమ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు అంకం అశోక్ నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఆయనతో మండల ప్రధాన కార్యదర్శి గుర్ల నారాయణ, నాయకులు బొజ్జన్న, గంగన్న, మస్కారి హన్మండ్లు, రమేష్, అశోక్, అనిల్, సాంబజి, బేరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

● ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించిన ప్రయాణికులు

తలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసాయి గ్రామం నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం తలమడుగు వాగు వద్ద మరమ్మతులకు గురైంది. ఆగిపోయిన బస్సు స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు బయలుదేరారు. అనంతరం ఆర్టీసీ డ్రైవర్ బస్సును మరమ్మతు చేయించుకొని ఆదిలాబాద్ వెళ్లిపోయారు. కాగా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణంతో వెళ్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.



తలమడుగు వాగు వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్సు, ప్రైవేటు వాహనాల కోసం చూస్తున్న ప్రయాణికులు

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోరెత్తించారు. ఈమేరకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీఓ పన్నెండును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ నుంచి వచ్చే క్లెయిమ్‌లను ప్రైవేట్ కంపెనీలకు అప్పచెప్పే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. వెల్ఫేర్ బోర్డు ద్వార కార్మికులు తీసుకున్న కార్డులను రెన్యువల్ చేయాలని, క్లెయిమ్‌లను ప్రభుత్వం కార్మికుల ఖాతాల్లోనే జమ చేయాలని కోరారు. లేకపోతే కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు కిష్టయ్య, నాయకులు మహేష్, మహేందర్, భీంకుమార్, గంగన్న, ఇంద్రరాజ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు బ్రహ్మచారిణిగా అమ్మవారు

బాసర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాసర సర్వతీ అమ్మవారు మంగళవారం బ్రహ్మచారణి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. క్యూలైన్‌లలో భక్త జనసంద్రం కనిపిస్తుంది. అమ్మవారు రెండోరోజు బ్రహ్మచారిణీ దేవిగా దర్శనం ఇచ్చారు. నైవేద్యంగా పులిహోరను అర్చకులు అమ్మవారికి సమర్పించారు.



బాసర గోదావరి వద్ద ఉన్న స్నాన ఘట్టాలు

గోదావరి పుష్కరాలపై.. కసరత్తు



బాసర అమ్మవారు

- నది తీరం వెంట కొత్తగా స్నాన ఘట్టాల నిర్మాణాలు
- అంచనాల రూపకల్పనలో అధికారుల నిమగ్నం
- భారీ ఏర్పాట్లకు సర్కార్ సన్నాహాలు
- మాస్టర్‌ప్లాన్‌తో బాసర ఆలయం ముస్తాబు
- ఐదు శాఖలకు బాధ్యతలు

నిర్మల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు యంత్రాంగం పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి నిర్మల్ జిల్లా ఉన్నతాధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో అధికారులు జిల్లాలోని మొత్తం గోదావరి పరివాహక ప్రాంతంలో క్షేత్ర స్థాయి సర్వేను జరిపేందుకు సిద్ధమవుతున్నారు. మహారాష్ట్ర నుంచి గోదావరి నది జిల్లాలోని బాసర వద్ద ఇక్కడి సరిహద్దులను దాటుతుంది. ఇక్కడి నుంచి ప్రవహించే గోదావరి నది కడెం, చిన్న బెల్లాల్ మీదుగా కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఒకేరోజు రెండు లక్షల మంది గోదావరి నదిలో పుష్కరస్నానాలు ఆచరించే విధంగా ఏర్పాట్లు చేపట్టాలంటూ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగానే అధికార యంత్రాంగమంతా కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని బాసరవద్ద భారీ ఏర్పాట్లు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇక్కడ ప్రస్తుతమున్న పుష్కరఘాట్లతో పాటు అదనంగా పుష్కర ఘాట్లను నిర్మించడమే కాకుండా సరస్వతీ దేవాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతున్నారు. ముఖ్యంగా భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాలున్న కారణంగా పార్కింగ్ ఏరియాను ఇక్కడ ప్రత్యేకంగా నిర్మించాల్సిన అవసరం ఉంది. బాసరతో పాటు నిర్మల్ జిల్లాలోని ప్రధానమైన సోన్ గోదావరి వద్ద కూడా పెద్దఎత్తున ఏర్పాట్లు చేయబోతున్నారు. బాసర తరహాలోనే సోన్ గోదావరి నది వద్దకు భక్తులు పుష్కరాల సమయంలో భారీసంఖ్యలో తరలివస్తారు. అన్ని రకాల మౌలిక సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. లోకేశ్వరం మండలంలోని బ్రహ్మేశ్వర్, పంచగుడి వద్ద కూడా ఏర్పాట్లు చేపట్టనున్నారు. ఇక్కడి బ్రహ్మేశ్వరాలయంలో కూడా పుష్కరాల సమయంలో భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహిస్తారు. దాదాపు 40 కిలోమీటర్ల మేర గోదావరి పరివాహక ప్రాంతాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలను రూపొందించనున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో పాటు దేవాదాయ, పర్యాటక శాఖలు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను సంయుక్తంగా చేపట్టబోతున్నాయి. దీంతో పాటు పోలీస్ శాఖ అలాగే పంచాయతీ శాఖల సహకారం కూడా తీసుకోనున్నారు. ఇలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లతో పాటు పుష్కరాలు పూర్తయ్యే వరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోబోతున్నాయి. తీరం వెంట కొత్తగా స్నానఘట్టాల నిర్మించనున్నారు.

గోదావరి వెంబడి ఘాట్‌ల ఏర్పాట్లు

బాసరతో పాటు ఓనీ, కౌట, సాలాపూర్‌లలో కూడా గోదావరినది ప్రవహిస్తుంది. ముథోల్‌లోని ఆష్టా, బ్రహ్మంగావ్ గోదావరి తీరం వద్ద భక్తులు పుష్కర స్నానాలు ఆచరిస్తారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న పుష్కర ఘాట్‌తో పాటు ఈ ఘాట్‌ను మరింతగా విస్తరించాల్సి ఉంది. అలాగే లోకేశ్వరంలోని కనకాపూర్ శివారులో గల బ్రహ్మేశ్వరాలయం, పంచగుడి, వాస్తాపూర్, మోహల, పిప్రి, భామ్ని, గడ్‌చందా, దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి, కంజర్, టెంబుర్ని, ఆర్లి, కాండ్లి, సోన్ మండల కేంద్రంతో పాటు లక్ష్మణచాంద మండలంలోని పీచర, ధర్మారం, పార్‌పెల్లి, చింతల్‌చందా, మామడలోని కమల్‌కోట్, పొన్కల్, ఖానాపూర్‌లోని బాధన్‌కుర్తి, కొత్తపేట, సుర్జాపూర్, బాబాపూర్, దిలావర్‌పూర్‌తో పాటు కడెంలోని లింగాపూర్, చిన్న బెల్లాల్ వరకు గోదావరి నది ప్రవహిస్తుంది. ఈ అన్ని ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఘాట్లు ఏర్పాట్లు చేయాలని కార్యాచరణ రూపొందిస్తున్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

- చెప్పులను వరుసలో పెట్టి పడిగాపులు కాస్తున్న రైతులు
- కడెం మండల కేంద్రంలో ఇబ్బందులు



చెప్పులు పెట్టి పడిగాపులు కాస్తున్న రైతులు

కడెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత రైతులను చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఉదయం నుంచే క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం యూరియా కోసం తమ చెప్పులను వరుసలో పెట్టి పడిగాపులు కాశారు. సోమవారం మొత్తం 450 యూరియా బస్తాలు రాగా, మంగళవారం 170 మంది రైతులకు 350 బస్తాలు ఇచ్చినట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సరిపడా యూరియాను సమయానికి అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. తమ ఇబ్బందులను తొలగించాలంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సోన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో మార్కౌట్, బేస్మెంట్, తదనంతర నిర్మాణ దశలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 30 లోపు అనుమతులు పొందిన అన్ని ఇళ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తి చేసి, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 9,161 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. (ప్రతి నియోజకవర్గానికి 3,500ల చొప్పున, పీవీటీజీలకు ప్రత్యేకంగా) ఇందులో 60 శాతం మార్కౌట్‌లు పూర్తవగా, 50 శాతం పైగా ఇళ్లు బేస్మెంట్‌స్థాయి వరకు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు 24 కోట్ల 68 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పర్యావరణ అనుమతులు తప్పనిసరి..

నిర్మల్‌రూరల్ : అభివృద్ధి పనుల నిర్మాణంలో పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఆమె జిల్లా సర్వేరిపోర్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో రానున్న రోజుల్లో చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ముందుగానే పర్యావరణ అనుమతులు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, సీపీవో జీవరత్నం, జిల్లా సర్వే రిపోర్ట్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతతో రహదారి భద్రతకు ముందడుగు



ఒప్పందం చేసుకుంటున్న అధికారులు, ప్రతినిధులు

బాసర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత అవగాహనను ప్రోత్సహించడానికి రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ బాసర సర్వేజన ఫౌండేషన్ అవగాహన ఒప్పందం మంగళవారం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు రహదారి భద్రతపై శిక్షణ, అవగాహన కల్పించడం, స్థానిక సమాజాలలో ప్రచారాలు నిర్వహించడం, పరిశోధన ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించడం వంటి వాటిలో కలిసి పనిచేయనున్నాయి. ఈ సహకారంతో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు వర్క్‌షాపులు, శిక్షణా సెషన్లు నిర్వహించనున్నారు. ఎమ్ఓయూ సంతక కార్యక్రమంలో డాక్టర్ బీ. జనార్ధన్‌రెడ్డి, ఐఏఎస్(రిటైర్డ్), సీఈవో సర్వేజన ఫౌండేషన్ వి. ప్రవీణ్‌కుమార్, సీవోవో, డాక్టర్ సిద్ధార్థ, రోడ్ సేఫ్టీ ప్రోగ్రామ్ మేనేజర్, ఆర్జీయూకేటీ బాసర వీసీ గోవర్ధన్‌లున్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ), బాసరలో నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సమాజ సేవపై అవగాహన పెంపొందించడం, యువతలో సేవా స్ఫూర్తి నింపడం లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ప్రధాన కార్యక్రమానికి ఆర్జీయూకేటీ ఉపకులపతి ప్రొఫేసర్ ఏ. గోవర్ధన్ హాజరై మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర విశిష్టమైనది. విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి అని సూచించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకల్లో భాగంగా కలెక్టర్ అభిలాష అభినవ్ బతుకమ్మలకు పూజలు చేశారు. సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతిరోజు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. అంతకుముందు పలువురు మహిళా ఉద్యోగులు వేసిన రంగవల్లులను కలెక్టర్ పరిశీలించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంపొందేలా రంగవల్లులను రూపొందించిన ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు. బతుకమ్మ వేడుకల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, మహిళా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పసుపు దిగుబడికి అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం శోభారాణి

దిలావర్‌పూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన పసుపు దిగుబడి కోసం తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై నేషనల్ టర్మరిక్ బోర్డ్, స్పైస్‌బోర్డ్ ఆఫ్ ఇండియా, హవాల్ ఫౌండేషన్, నాశముక్తి భారత్ అభియాన్, డీఆర్డీఏ ఐకేపీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దిలావర్‌పూర్, నర్సాపూర్, లోకేశ్వరం, కుంటాల మండలాలకు చెందిన పసుపు పండించే రైతులకు, సరస్వతీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పసుపు పంటలను ఆశించే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలపై వివరించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. దిలావర్‌పూర్ మండల సరస్వతీ మహిళా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీకి భూసార పరీక్షలు చేసే మిషన్ ఉందని, రైతులు సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు పంటపై ఎలాంటి సబ్సిడీలు, పథకాలపై అవగాహన కల్పించారు. ఏ ట్రైకో డార్మా ద్వారా విత్తన శుద్ధి చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఐకేపీ డీపీఎం శోభారాణి, స్పైస్ బోర్డ్ డీడీ సుందరష్ రాజా మాణిక్యం, మదర్ ఎన్ఎస్ఎస్‌పీ రీజినల్ కోఆర్డినేటర్ ఉపేందర్ రెడ్డి, అవ్వల్ ఫౌండేషన్ సీఈవో బండారు రమేష్, నాశముక్తి భారత్ అభియాన్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, సరస్వతీ మహిళా రైతు కంపెనీ చైర్మన్ సుజాత, వైస్ చైర్మన్ రాణి, ఐకేపీ ఏపీఎంలు బోసు, అర్జుబాయి, సీసీలు సాయన్న పాల్గొన్నారు.

వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం



మునిపెల్లిలో మునిగిన పుష్కర ఘాట్



మృతిచెందిన ఎద్దును పరిశీలిస్తున్న అధికారులు,



రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న నీరు



లింబా(కే) గ్రామ సమీపంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న లో-లెవెల్ వంతెన

సారంగాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు బీరవెల్లి, స్వర్ణ, కౌట్ల(బి), ధని ప్యారామూర్, గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగు వంకలు వరద నీరుతో పొంగి పొర్లడంతో పాటు పంట పొలాలలోకి వరద నీరు వచ్చి చేరడంతో పత్తి సోయాబీన్ వంటి పంటలు నీట మునిగాయి. బీరవెల్లి వంజర్ రహదారిపై చెట్టు విరిగి పడిపోవడంతో రాకపోకలు నిలిచి పోయాయి.

ఎడ్ల బండి, ఎద్దు మృతి

తానూర్ : మండలంలోని కోలూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పంట పొలాల నుంచి ఎడ్లబండపై తిరిగి వస్తుండగా వరద ప్రవాహంలో చిక్కుకొని ఎద్దు మరణించింది. గ్రామానికి చెందిన రైతు వోల్కోడ్ సయ్యాజీ రాజన్న తన పొలంలో పనులు ముగించుకొని, ఎడ్లబండిపై ఇంటికి బయలుదేరారు. మార్గ మధ్యలో ఉన్న ఓ వాగు దాటుతుండగా, ఆకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులో నీటి ప్రవాహం పెరిగి, ఎడ్లబండి ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన రైతు సయ్యాజీ వెంటనే బండి పై నుంచి దూకి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. బండికి కట్టిన రెండు ఎద్దులలో ఒకటి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించింది. మరో ఎద్దు, బండి వెనుక ఉన్న గేదె తాళ్లు తెగిపోవడంతో సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నాయి. ఎద్దు విలువ సుమారు 80వేలు ఉంటుంది.

మళ్లీ ఉప్పొంగిన గోదావరి..

లక్ష్మణచాంద : గోదావరి నది మళ్లీ ఉప్పొంగింది. దీని వలన పశువులు గోదావరి మధ్యలో గల గడ్డి భూములకు మేతకు వెళ్లలేకపోయాయి. శ్రీరాంసాగర్‌కు ఎగువ నుంచి 2 లక్షల 22 వేల 155 క్యూసెక్కుల నీరు వస్తుండగా 3 లక్షల 51 వేయి 165 క్యూసెక్కుల నీటిని గోదావరి, ఇతర కాలువలలోకి వదిలారు. దీంతో గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. మండంలోని మునిపెల్లి గోదావరి పుష్కర ఘాట్ మునిగింది. గోదావరి వరద వలన నది ఒడ్డున గల మునిపెల్లి, పార్‌పెల్లి, మాచాపూర్, చామన్‌పెల్లి, చింతల్ చందా, ధర్మారం, పీచర శివారులో గల మొక్కజొన్న, సోయాబీన్, వరి, పసుపు, పత్తి తదితర పంటలు నీట మునిగి నష్టపోయిన సంగతి అందరికీ తెలిసిందే. కాగా మళ్లీ గోదావరి ఉప్పొంగుతుండటం చూసి రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

భైంసాలో రాకపోకలు ఇబ్బందులు

భైంసారూరల్ : మండలంలోని మాటేగాం గ్రామం నుంచి బిజ్జూర్ గ్రామ సమీపంలో ఉన్న చిన్న సుద్దవాగులో భారీ వర్షం కురవడంతో రోడ్డుపై నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ప్రజలు వెళ్లడానికి భయభ్రాంతులకు గురయ్యారు. నీటి ప్రభావం తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రజలు చాత, హల్దా గ్రామాల నుంచి మహారాష్ట్రకు వెళ్లారు.

లోకేశ్వరంలో భారీ వర్షం...

లోకేశ్వరం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భారీ నుంచి అతిభారీ వర్షం పెద్ద పెద్ద శబ్దాలతో, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. ఇప్పటికే ఈ వర్షాల కారణంగా సోయా, మినుము, పెసర, మొక్కజొన్న, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని అధికారులను కోరారు.

కుంటాల : మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లింబా(కే) గ్రామ సమీపంలో గల లోలెవల్ వంతెన కొద్ది సేపు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామం నుంచి భైంసా మండలం వానల్‌పాడ్ వైపునకు వెళ్లడానికి రాకపోకలు నిలిచిపోయాయి. అంతేగాకుండా గ్రామ సమీపంలో గల బస్టాండ్ వద్ద మరో లోలెవల్ వంతెన ఉప్పొంగి ప్రవహించడంతో అంతర్గత రహదారులు అన్ని జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ అక్కడికి చేరుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్ భోజన్నను లోకేశ్వరం బీజేపీ సీనియర్ నాయకులు ఎం. శ్రీధర్, రవీందర్, గంగాధర్, రమేష్, తదితరులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు కావాల్సిన పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై పోలీసుల కొరడా

భైంసా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో మంగళవారం పట్టణ పోలీసులు నెంబర్‌ప్లేట్ లేని వాహనాలపై కొరడా ఝులిపించారు. టౌన్ ఎస్ఐ నవనీత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల బృందం ప్రధాన రోడ్డు మార్గంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టి నెంబర్‌ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ నవనీత్ రెడ్డి మాట్లాడుతూ నెంబర్ ప్లేట్‌లేకుండా తిరిగే వాహనాలు తరచూ చోరీలు, నేరాలకు కారణంగా మారుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు. వాహన యజమానులు వాహనాలకు నెంబరు ప్లేట్లు అమర్చుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నెంబర్ ప్లేట్‌లేని వాహనాలను గుర్తించి సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేశారు.